నేడు మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నల్గొండలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి షెడ్యూల్ విడుదల చేశారు. పట్టణ సమీపంలో ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. అనంతరం అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో క్రీడల కార్యక్రమంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

ఆట..ఉయ్యాలపాట..!



నల్గొండలో బతుకమ్మ ఆడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఉద్యోగులు

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఓటరు జాబితా

భువనగిరి, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఓటరు జాబితా నిబంధనల ప్రకారం రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే మార్చి 29 నాటికి పూర్తవుతుందని, అందుకోసం అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు, పట్టభద్రులు మరోసారి కొత్తగా ఓటును నమోదు చేయాలని సూచించారు. నవంబర్ 6 లోపు నమోదు గడువు ముగుస్తుందన్నారు. సమీక్షలో కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

మూసీ దారికొచ్చేది ఎప్పుడు..!


మూసీ ప్రాజెక్టు

నకిరేకల్, న్యూస్‌టుడే: మూసీ.. గత రెండుమూడేళ్ల నుంచి నాగార్జునసాగర్ కంటే ముందుగానే నిండుతుంది.. పదేళ్ల నుంచి మండువేసవిలో నిండు కుండలా కనువిందు చేస్తోంది. 65వ నెంబర్ హైదరాబాద్- విజయవాడ, 365 నకిరేకల్- తానంచర్ల జాతీయ రహదారుల మధ్యలో ఉన్న జలాశయం ఇది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. నకిరేకల్ సమీపంలో మూసీ నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించి ఆరుదశాబ్దాలైనా నేటికి సరైన రోడ్డు సదుపాయం లేదు.

☛ మూసీ ప్రాజెక్టు వద్దకు చేరుకునేందుకు నకిరేకల్ నుంచే ప్రధాన రహదారి సౌకర్యం ఉంది. ఇది ఒక్క వరుసతోనే ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నకిరేకల్ నుంచి మూసీ ప్రాజెక్టు 12 కిలోమీటర్లు. ఇరుకు రహదారిపై తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు అధికంగా బోల్తా పడుతున్నాయి. ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిని రెండు వరుసలుగా విస్తరించాలని పదేళ్ల నుంచి స్థానికులు కోరుతున్నారు.

☛ ప్రాజెక్టు వద్దకు వచ్చే పర్యాటకులతో పాటు ఈ రోడ్డుపై నకిరేకల్, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు చెందిన 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాజెక్టు, గేట్ల మరమ్మతులకు అవసరమైన భారీ క్రేన్లు, ఇతర వాహనాలు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఇంత కీలకమైన రహదారి విస్తరణలో దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ రహదారి పలు చోట్ల ధ్వంసమై గోతుల మయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం రూ.10 కోట్లతో దీని విస్తరణకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల మళ్లీ ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా మూసీ రహదారికి నిధుల ఊసే లేదు.


ఒకే వరుసతో ఇరుకుగా గుంతలతో ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రధాన రహదారి దుస్థితి

రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు

నకిరేకల్- మూసీ ప్రాజెక్టు రహదారి విస్తరణ కోసం రూ.30 కోట్లతో ఐదు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ నకిరేకల్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. నకిరేకల్ ప్రధాన కూడలి నుంచి నోముల గ్రామం వైపు మూడ కిలోమీటర్ల మేర ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కూడా ఇదే ప్యాకేజీలో ప్రతిపాదించామన్నారు.

తపాలా సేవ.. సాంకేతిక తోవ


మిర్యాలగూడలోని ప్రధాన తపాలా కార్యాలయం

◆ నేడు 'ప్రపంచ తపాలా దినోత్సవం'

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన, ఉప తపాలా కార్యాలయాలు..

నల్గొండ	సూర్యాపేట	భువనగిరి	మిర్యాలగూడ
25	17	12	10

● ప్రధాన కార్యాలయం ● ఉప కార్యాలయాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ఒకప్పుడు ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలా శాఖ, మారుతున్న కాలానికనుగుణంగా అనేక అధునాతన సేవలు అందిస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకునేందుకు సిబ్బందిని సైతం సిద్ధం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుంది.

తక్షణ సేవలు..

ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, నల్గొండ, భువనగిరిలో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలంటే సమయాభావంతో ప్రజలు అనేక ఇబ్బందుడు పడుతున్నారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ సిబ్బందికి 5జీ చరవాణులు అందించి ఇంటి వద్ద కానీ, కార్యాలయంలో కానీ రెండే నిమిషాల్లో ఖాతా తెరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ డివిజన్‌లో 358, సూర్యాపేట డివిజన్‌లో 318 చరవాణులు పంపిణీ చేయగా.. తాజాగా సూర్యాపేట డివిజన్‌లో సిబ్బందికి మినీ ముద్రణ యంత్రాలను సైతం అందించారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 12 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7 నుంచి 12 వరకు చేపట్టనున్న కార్యక్రమాలు..

9	ప్రపంచ తపాలా దినోత్సవం
11	అంత్యోదయ దినోత్సవం
12	బాలికల ఆర్థిక అక్షరాస్యత దినోత్సవం

కొనసాగుతున్నవి..

ఇక తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటిలో ముఖ్యమైనవి సుకన్య సమృద్ధి యోజన పథకంతో పాటు రూ.399, రూ.499 ఏడాది ప్రీమియంతో అందించే రూ.10 లక్షలు, రూ.15లక్షల బీమా పథకాలతో పాటు బాల ఆధార్, తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

వీటితో పాటు మహిళ ఆర్థిక అభ్యున్నతికి ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక స్వావలంభన అందించేందుకు వడ్డీ రేట్ల పెంపు వంటివి సైతం ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక కార్యక్రమాలు:

వెంకటేశ్వర్లు, తపాలా సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్



ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది 150 ఏళ్ల థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వీటిలో ప్రధానంగా విద్యార్థులకు ఉత్తరాల ప్రాముఖ్యత, చరిత్రను వివరించేందుకు క్విజ్, వ్యాసరచన పోటీలతో పాటు బాలికా సాధికారత కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నాం. వీటితో పాటు అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నాం.

కొనసాగుతున్న ఎన్‌సీసీ కాడెట్ల శిక్షణ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్‌లో 31(టి)బెటాలియన్ ఎన్‌సీసీ నల్గొండ ఆధ్వర్యంలో వార్షిక శిబిరం కొనసాగుతుంది. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఎన్‌సీసీ శిబిరం 11వ తేదీ వరకు కొనసాగనుంది. ఎన్‌సీసీ 31(టి)బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ టీఎం లక్షారెడ్డి మంగళవారం కాడెట్‌లనుద్దేశించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి 600 మంది బాల, బాలికలు శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కాడెట్లు డ్రిల్, ఫైరింగ్, గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా ఫైర్ సేఫ్టీ, సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ అవగాహన శిక్షణ, యోగా, స్వచ్ఛభారత్ తదితర అనుబంధ విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్‌రావు, సుబేదార్ మేజర్ ఎల్.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్గొండ కమాండింగ్ అధికారి కల్నల్ టీఎం లక్షారెడ్డి

తెగుళ్లపై జాగ్రత్త అవసరం


పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

త్రిపురారం, న్యూస్‌టుడే: వరి పొలాలకు సోకే వివిధ రకాల తెగుళ్లపై రైతులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పాల్తీతండాలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోకిన తెగుళ్లకు వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు సరైన మందులను ఉపయోగించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి పార్వతి చౌహాన్, ఏఈవో నాగరాజు, రైతులు గణేష్, లక్పతి, బాలు, కృష్ణ పాల్గొన్నారు.


విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎంహెచ్‌వో


నకిరేకల్: ఓగోడు పీహెచ్‌సీలో ల్యాబ్ దస్త్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్

నకిరేకల్, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల నియంత్రణకు క్షేత్రస్థాయిలో వైద్య,ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్ సూచించారు. నకిరేకల్ మండలం ఓగోడు పీహెచ్‌సీని మంగళవారం తనిఖీచేసి మాట్లాడారు. సకాలంలో విధులకు హాజరుకావాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్ దస్త్రాలు, ఔషధాల నిల్వలు పరిశీలించారు. ఆరుగురు జ్వర బాధితుల నుంచి సేకరించిన రక్తనమూనాలను టీ-హబ్‌కు పంపించాలని సూచించారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారిణి డా.యోగస్వీ, హెచ్‌ఈవో నర్సింహాచారి, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహ స్వామి స్వయంభూ క్షేత్రంలో మంగళవారం నిత్య, సంప్రదాయ ఆరాధనలు ఆలయ శాస్త్రరీత్యా కొనసాగాయి. ఆలయ మూలవరులకు నిజాభిషేకం, తులసీ అర్చన, క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. పంచామృతంతో అభిషేకం చేపట్టారు. దర్శణమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం నిర్వహించారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రివేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన, సహస్ర నామార్చన నిర్వహించారు. ఉపాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి వారికి వేద, మంత్రాలతో తమల పాకులతో ఆస్థానపరంగా ఆరాధించారు. ఆర్జిత కైంకర్యాన్ని విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆకు పూజ చేపట్టారు. సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలోనూ శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ, నిత్యపూజలు నిర్వహించారు.


కల్యాణంలో పాల్గొన్న భక్త దంపతులు

యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలను ఆలయ ఆచారంగా చేపట్టారు. అమ్మవారిని పార్వతీ దేవీ అలంకరణతో తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరోరోజు పర్వత వర్ధిని అలంకారంలో అమ్మవారి దర్శనం, ప్రాతఃకాల పూజ, అర్చనలు పారాయణములు గాయత్రీ జపములు లలిత సహస్రనామార్చన జరిపారు.

'డిజి లాకర్'.. ధ్రువపత్రాలు ఇక భద్రం

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలు ఎంతో కీలకం. అవసరమైనప్పుడు మనదగ్గర ఉండకపోవచ్చు. ఆ సమయంలో మంచి అవకాశాలు చేజారిపోవచ్చు. ఇలాంటి సమస్యలు అధిగమిం



చేందుకు కేంద్రం తీసుకొచ్చిన సురక్షిత డిజి లాకర్ యాప్‌లో ధ్రువపత్రాలు భద్రపరుచుకోవచ్చు. ఇటీవల పలు యూనివర్సిటీలు తమ పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో ఈ డిజి లాకర్ ఐడీని ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు భద్రపరుచుకునేలా చర్యలు చేపడుతున్నాయి. ఈ సదుపాయం లేకముందు ఈ-మెయిల్లో భద్రపరుచుకునేవారు. వీటికంటే ప్రభుత్వ అధికృత యాప్ డిజి లాకర్‌లో భద్రపర్చుకుంటే సురక్షితమని విద్యా నిపుణులు చెబుతున్నారు.

పోతాయనే భయం ఉండదు

డిజి లాకర్‌తో అనుసంధానమైన ప్రభుత్వ శాఖలు అందించే పత్రాలను వీటిలో భద్రపరచుకోవచ్చు. అందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే చాలు. అనుసంధానం కాకపోయినా స్కాన్ చేసిన పత్రాలను భద్రపరచవచ్చు. అందుకు ప్రతి లాకర్‌కు 1 జీబీ స్టోరేజ్ సామర్థ్యం కేటాయిస్తారు. ధ్రువపత్రాలు సమర్పించడానికి యూఆర్ఎల్ లింక్ పంపించడానికి కొన్ని సంస్థలు అనుమతులు కూడా ఇస్తున్నాయి. విదేశీ, దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు ధ్రువపత్రాలు తీసుకెళ్లే సమయంలో పోతాయనే భయం ఉండదు.

డౌన్‌లోడ్ ఇలా..

★ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి డిజి లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
★ యాప్‌లో మీ పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు, ఆరు అంకెల పిన్ నంబరు నమోదు చేయాలి.
★ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేస్తే డిజి లాకర్ యాప్ ప్రారంభించడానికి సిద్ధమైనట్లు అర్థం.
★ యాప్‌లో పాన్ కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్ల జాబితా కనిపిస్తుంది.
★ వాటిలో మనకు కావాల్సినవి ఎంచుకుని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలి.

ఏమేం దాచుకోవచ్చు..

ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యార్హత ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, జనన పత్రాలు, ఆస్తి, రిజిస్ట్రేషన్ కాగితాలు, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా, ఓటరు కార్డు.. ఇలా.. ఒకటేమిటి మీకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, కార్డులు భద్రపరుచుకోవచ్చు.

★ ఉదాహరణకు 10వ తరగతి మెమో కావాలంటే బోర్డు ఎంచుకున్నాక హాల్ టికెట్ నంబరు నమోదు చేయాలి. 2004 తర్వాత పత్రాలు అందుబాటులో ఉన్నాయి. అలారాని పక్షంలో డిజి లాకర్ డ్రైవ్‌ను క్లిక్ చేస్తే ప్లస్ సింబల్ కనిపిస్తుంది. క్లిక్ చేసి కావాల్సిన పత్రాలను మాన్యువల్‌గా అప్‌లోడ్ చేసి దాచుకోవచ్చు.

మిద్దెపై పంట.. ఇంట్లో వంట



మిద్దె తోటలో పెంచుతున్న కూరగాయలు, పండ్ల చెట్లు

మిద్దె సాగే ఆరోగ్యమని, ఇలా పండించిన ఉత్పత్తులతో ఇప్పటివరకు తమకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని పేర్కొంటున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు. నల్గొండ జిల్లా కేంద్రంలోని హిమగిరి కాలనీకి చెందిన ఉపాధ్యాయ దంపతులు పుష్ప-శంకర్‌రెడ్డి.. గత 12 ఏళ్లుగా కూరగాయలు, పండ్ల చెట్లు, ఆకుకూరలు, వివిధ రకాల పూల, అలంకారం మొక్కలను మిద్దెపై పెంచుతున్నారు. ఆ తోటలోనే రాలిన ఆకులని సేంద్రియ ఎరువులుగా తయారు చేసి మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇలా పండించిన వాటిని తాము తినడమే కాకుండా కాలనీలో సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బయట నుంచి ఏ కూరగాయలు తెచ్చుకోమని పేర్కొంటున్నారు. గతంలో మధుమేహ వ్యాధి ఉన్నా.. సేంద్రియ ఎరువుల వాడకంతో పండిన వాటిని తింటుండటంతో ప్రస్తుతం నియంత్రణలో ఉందని తెలిపారు. 100 రకాలకు పైగా కూరగాయాలు, పండ్ల, పూల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. హైదరాబాదులో నిర్వహించే మొక్కల ప్రదర్శనలు తిలకిస్తూ.. అక్కడ నుంచి కొత్త వంగడాలను తీసుకొచ్చి పెంచుతున్నామని, అరుదైన చెర్రీ, డ్రాగన్, వాటర్ ఆపిల్, టేబుల్ లెమన్, స్వీట్ లెమన్, తెల్ల అల్లనేరేడు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ బటన్ మిర్చి ప్రత్యేకంగా పెంచుతున్నట్లు.. ఇది చాలా ఘాటుగా ఉంటుందని పేర్కొన్నారు.
- ఈనాడు నల్గొండ







లిల్లీ మొక్కల వద్ద ఉపాధ్యాయుడు శంకర్ రెడ్డి



సాగుచేసిన సొరకాయ వద్ద ఉపాధ్యాయిని పుష్ప

ఆ అలవాటుకు.. 25 ఏళ్లు



రాగూర్ సేకరించిన వివిధ దేశాల తపాలా స్టాంపులు

○ నాణేలు, విదేశీ కరెన్సీ నోట్లు సేకరిస్తున్న వ్యాపారి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చిన్నతనంలో తమ ఇంటికి వచ్చే ఉత్తరాల స్టాంపులు సేకరించడం అలవాటుగా మారిన అతడికి.. చదువుకునే వయసులో బహుమతిగా వచ్చిన నేపాల్ కరెన్సీ నోటు.. వివిధ దేశాల కరెన్సీ నోట్ల సేకరణకు ప్రాణం పోసింది. దీంతో 25 ఏళ్లుగా వేలాది స్టాంపులు, నాణేలు, నోట్లు సేకరించిన అతడు.. నేటితరం చిన్నారులకు వాటి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో తన వ్యాపార ప్రాంతంలో ప్రదర్శిస్తున్నాడు.

★ మిర్యాలగూడ పట్టణానికి చెందిన గరిణె రాగూర్.. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. 1998లో నాలుగో తరగతి చదువుతున్నప్పుడు తన ఇంటికి వచ్చే ఉత్తరాల నుంచి స్టాంపులు సేకరించడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లకు తమ ఇంటి సమీపంలోని ఓ వసతిగృహానికి కాపలాదారుగా ఉన్న నేపాల్ వ్యక్తిని వారి నగదు ఎలా ఉంటుందని అడుగగా.. అతడొక నోటును బహుమతిగా ఇచ్చాడు. దానిని మురిపెంగా చూసుకుని ఇతర దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు. దీంతో దీనినే తన అలవాటుగా మలచుకుని నేటి వరకు సుమారు వంద దేశాల నుంచి సేకరించిన 2వేల నోట్లు, 5వేల నాణేలు, వివిధ దేశాలకు చెందిన 4వేల స్టాంపులు సేకరించాడు. వీటితో పాటు దేశానికి చెందిన సుమారు 400 రకాల అగ్గిపెట్టెలు సైతం సేకరించాడు. వీటి విలువ సుమారు రూ.10లక్షలకు పైగానే ఉంటుందని అంచనా.



వివిధ దేశాల కరెన్సీ నోట్లు

పురాతనం నుంచి అధునాతనం వరకు..

రాగూర్ సేకరించిన వాటిలో పురాతన కాలం నుంచి ఇటీవలి వరకు కరెన్సీ నోట్లు, స్టాంపులు ఉన్నాయి. నిజాం నవాబుల కాలం నాటి స్టాంపులు, కరెన్సీ నోట్లతో పాటు వెండి నాణేలు, దిల్లీ సుల్తానుల, తమిళనాడు చోళ రాజుల, మైసూర్ టిప్పు సుల్తాన్ కాలాల నాటి నాణేలు సైతం సేకరించాడు. వీటితో పాటు ఇటీవల హాంకాంగ్, రష్యా, ఈస్ట్ కరేబియాన్, న్యూజిలాండ్, సోలోమన్ ఐలాండ్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలు ప్రవేశపెట్టిన పాలిథిన్ కరెన్సీ నోట్లు సైతం సేకరించాడు. వీటిలో ప్రపంచంలోనే అతి విలువైన దుబాయ్ కరెన్సీతో పాటు తక్కువ విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు సేకరించాడు. యుగోస్లేవియాలో పాత నోట్లు రద్దు చేసిన సమయంలో ముద్రించిన కొత్త నోట్లు సైతం ఇతడి సేకరణలో భాగమయ్యాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై వినాయకుడి చిత్రం, క్యూబా కరెన్సీ నోటుపై చెగువెరా చిత్రం ముద్రించిన నోట్లు సైతం సేకరించి ఔరా అనిపిస్తున్నాడు.

పిల్లలకు తెలియజేయాలనే: గరిణె రాగూర్, మిర్యాలగూడ



తపాలా స్టాంపులు, కరెన్సీ నోట్లు, నాణేలను విక్రయించాలన్న ఆలోచన ఎప్పుడూ చేయలేదు. వాటిని పెట్టెల్లో నిరుపయోగంగా ఉంచడం కంటే.. మా దుకాణానికి వచ్చే చిన్నారులకు వివిధ దేశాల కరెన్సీ.. తపాలా స్టాంపుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో నోట్లను టేబుల్‌పై అద్దం కింద పేర్చాను. వీటిని చూసిన చిన్నారులు వివిధ కరెన్సీ నోట్లు, వాటి విలువ, ప్రత్యేకతల గురించి వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాను.

హీటర్ వాడుతున్నారా..
ఈ జాగ్రత్తలు తప్పనిసరి



భానుపురి, న్యూస్‌టుడే: నిత్యం ఎక్కడో ఒకచోట విద్యుత్తు ప్రమాదాల కారణంగా మరణిస్తూనే ఉన్నారు. ఇంట్లో వాడే కరెంటు పరికరాలపై అవగాహన లేక విద్యుదాఘాతానికి గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, శీతాకాలంలో వేడి నీటితో స్నానం చేస్తారు. ఇందుకు నీళ్లను వేడి చేసేందుకు హీటర్ వినియోగిస్తారు. కొనేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విద్యుదాఘాతానికి గురవుతున్నారు. విద్యుత్తు ప్రసారం జరిగే ఇనుము బకెట్లో కాకుండా ప్లాస్టిక్ బకెట్‌లో నీటిని వేడిచేయాలి. హీటర్‌ను వినియోగించేటప్పుడు నీటిలోకి ఎంత మేర ఉంచాలో దానిపై గుర్తు ఉంటుంది. బకెట్‌లో ఉంచే సమయంలో కర్రను వాడాలి. నాణ్యత లేని హీటర్లను ఉపయోగించటం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. పాత వాటర్ హీటర్ రాడ్లను ఉపయోగించొద్దు. హీటర్‌కు లవణాలు పట్టుకొని ఉంటాయి. వారానికోసారి శుభ్రం చేస్తే త్వరగా నీరు వేడవుతుంది.

ఇలా చేస్తే మేలు..

☛ స్విచ్ ఆన్ చేసినప్పుడు నీటిని తాకొద్దు. విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. ఆఫ్ చేసిన 10 సెకన్ల తర్వాత వాటర్ హీటర్ బయటకు తీసి చూడాలి.
☛ పిల్లలు ఉన్నచోట, చేతికి అందే ప్రాంతంలో హీటర్ పెట్టవద్దు. విద్యుదాఘాతం జరిగే ఆస్కారం ఉంటుంది. స్నానపు గదుల్లో ఏర్పాటు చేసుకోవద్దు.
☛ హీటర్ పెట్టిన తర్వాత వేడి ఉన్నంత సేపు దానిని ప్లాస్టిక్ బకెట్‌కు దూరంగా ఉంచాలి. వేడికి ప్లాస్టిక్ కరిగిపోతోంది.
☛ హీటర్లను గంటల తరబడి పెట్టవద్దు.
☛ హీటర్ రాడ్‌ను నీళ్లలో మునిగేలా చూసుకోవాలి. స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత, ప్లగ్‌ను తీసిన తర్వాతే నీళ్లను తాకి వేడిని పరిశీలించాలి.
☛ ఐఎస్ఐ మార్కు ఉన్న హీటర్లను కొనుగోలు చేయాలి. 1500-200 వాట్స్‌తోపాటు ఓల్టేజీ 230-250 మధ్య ఉండే హీటర్లను కొనాలి.

జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు

జిల్లా	కనెక్షన్లు
సూర్యాపేట	4,51,501
నల్గొండ	5,82,220
యాదాద్రి	3,75,247

చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి ఒకరికి జైలుశిక్ష

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య ఎలియాస్ రాములుకు సంవత్సరం జైలుశిక్ష ఖరారు చేస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ఆ తీర్పు ప్రకారం వివరాలు.. రావులపల్లి గ్రామానికి చెందిన పట్టేటి రామయ్య తన అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన కసనబోయిన లింగయ్య వద్ద రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించే నిమిత్తం అదే మొత్తానికి చెక్కు జారీ చేశాడు. దాన్ని బ్యాంకులో జమచేయగా రామయ్య ఖాతాలో నగదు నిల్వలు లేని కారణంగా చెల్లుబాటు కాలేదు. నోటీసు పంపినా ఫలితం లేకపోవడంతో బాధితుడు తుంగతుర్తి ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశాడు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడైన రామయ్యపై నేరాన్ని నిర్ధారించి సంవత్సరం జైలుశిక్ష విధించడంతోపాటు రూ.3.60 లక్షలు బాధితునికి పరిహారంగా చెల్లించాలని ఆదేశిస్తూ గతంలోనే తీర్పు ఇచ్చింది. తీర్పుపై నిందితుడు జిల్లా న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసుకోగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నిందితునికి విచారణ న్యాయస్థానం విధించిన జైలుశిక్ష, జరిమానాలను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు.

గంజాయి స్మగ్లర్లపై కేసు నమోదు

చౌటుప్పల్‌గ్రామీణం: కారులో అక్రమంగా 54 కిలోల గంజాయిని తరలిస్తుండగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని పుణేకు కారులోని సీట్ల కింద రహస్య స్థావరంలో ముగ్గురు స్మగ్లర్లు గంజాయిని తరలిస్తున్నట్టు చెప్పారు. రాచకొండ ఎస్వోటీ పోలీసులతో కలిసి కారును, గంజాయిని, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రకాశ్ ధ్యానేశ్వర్, నవనత్ బాబన్ మహిత, ధర్మ అశోభ తువార్‌లపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఎదురుచూపులు ఉండవిక..!



సూర్యాపేటలోని మార్కెట్ యార్డులో పత్తి బస్తాలు(పాత చిత్రం)

❒ పత్తి నగదు సమాచారానికి కాటన్-అల్లై యాప్

భానుపురి, న్యూస్‌టుడే: సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు ఇక నుంచి దిగులుండదు. నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారికి ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. సమయానికి నగదు జమ కాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకు గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్తుంటారు. అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ 'కాటన్-అల్లై' పేరుతో కొత్త యాప్‌ను కొనుగోళ్ల వరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

7.18 లక్షల ఎకరాల సాగు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈసారి 7.18 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏ మేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో..)

సూర్యాపేట	78,094
నల్గొండ	5,40,022
యాదాద్రి	1,00649

ఎయిమ్స్‌ను సందర్శించిన రాష్ట్ర వైద్య బృందం

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, హైదరాబాద్ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్యులు, సంబంధిత శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియాతో పాటు వైద్య బృందం సభ్యులు.. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ బృందం సభ్యులకు వివరించారు. సమావేశ



బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవల వివరాలు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బృందానికి వివరిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ భాటియా

మందిరంలో ఏర్పాటుచేసిన తెరపై ఆసుపత్రి పురోగతిని వివరించారు. అనంతరం రాష్ట్ర బృందం ఆసుపత్రిలోని ఓపీడీ, ఇన్‌పేషెంట్, అత్యవసర విభాగాలు, పలు ల్యాబ్‌లను, ఎయిమ్స్ ఆవరణలో నిర్మితమవుతున్న నూతన భవన నిర్మాణ సముదాయాలను తిరిగి పరిశీలించారు. ఎయిమ్స్ మెడికల్ పర్యవేక్షకుడు డాక్టర్ అభిషేక్ అరోరా, వైద్యులు సంగీత సంపత్, శ్యామల అయ్యార్, తదితరులు పాల్గొన్నారు.

'తనిఖీలు జరుగుతున్నాయ్'

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రైస్ మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అనే దానిపై, సీఎంఆర్ గడువు తిరిగి పెంచేందుకు మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయని పౌరసరఫరాల డీఎం టీఎన్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఈనాడులో 'ధాన్యం ఉందా.. ధనమై పోయిందా' శీర్షికతో వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. జిల్లాలో 2023-24 వానాకాలంలో 2,08,113 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, దానికి మిల్లర్లు సీఎంఆర్ బియ్యం 1,39,436 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అందులో 82,729 మెట్రిక్ టన్నులు మిల్లర్లు ఇచ్చారని, ఇంకా 57,282 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని తెలిపారు. గత నెల 30తో సీఎంఆర్ గడువు ముగిసినందున ప్రస్తుతం ఎఫ్‌సీఐ మిల్లుల్లో రావాల్సిన బియ్యానికి ధాన్యం ఉందా లేదా తెలుసుకోవడం కోసం, మళ్లీ బియ్యం పెట్టేందుకు గడువు ఇచ్చేందుకు తనిఖీలు జరుగుతున్నాయని వివరించారు. బియ్యం బకాయి ఉండి మిల్లుల్లో ధాన్యం లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి.. ఆందోళన

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగిన ఘటన మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో చోటు చేసుకుంది. బాధిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన 10 నెలల గర్భిణి మౌనికకు నొప్పులు రావడంతో ఈ నెల 6న పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పురిటి నొప్పులు కావనే కారణంతో రెండు రోజుల పాటు సాధారణ ప్రసవం కోసం ఆసుపత్రిలో ఉంచారు. మంగళవారం ఉదయం గర్భంలోని శిశువు గుండె సక్రమంగా కొట్టుకోవడం లేదని హడావుడిగా శస్త్ర చికిత్స చేసి మగ బిడ్డ పుట్టాడని.. శిశువు ఆరోగ్యం సక్రమంగా లేనందున నల్గొండకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అంతదూరం వెళ్తే ప్రమాదం జరుగుతుందని భావించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్తామని చెప్పడంతో.. శిశువును చూపించకుండా వివిధ కారణాలతో ఆడ శిశువు మృతి చెందిందని తెలిపారని ఆరోపించారు. తొలుత మగ శిశువు అని చెప్పిన వైద్యులు.. తర్వాత ఆడ శిశువు అని చెప్పడంలో ఆంతర్యమేమిటని.. అంతా బాగానే ఉందని చెప్పి హడావుడిగా శస్త్ర చికిత్స నిర్వహించటమేమిటని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.



మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు

★ ఘటనపై ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వహీదా, డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ.. రెండు రోజులుగా గర్భస్థ శిశువు ఆరోగ్యం బాగానే ఉందని.. ఈ ఉదయం గుండె సక్రమంగా కొట్టుకోకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. శిశువు మెడకు బొడ్డు తాడు చుట్టుకోవడంతో పాటు గర్భంలోనే మల విసర్జన జరిగి, ఉమ్మనీరుతో పాటు మింగడంతో ఊపిరాడక మృతి చెందినట్లు వివరించారు. ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కాగా ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగార్జున తెలిపారు.

ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడులకు కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం బుధవారం నియామక ఉత్తర్వులు ఇవ్వనుంది. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ-2024 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చివరిదశకు చేరింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ప్రభుత్వం 1268 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలు ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియలో 1:3 చొప్పున మెరిట్ అభ్యర్థులను తీసి ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిపారు. వారి నుంచి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలు అందచేయనున్నారు. డీఎస్సీలో మొదటి సారి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి త్వరితగతిన ఫలితాలు వెల్లడించి నియామకాలు చేపట్టడం గమనార్హం.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండురోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్ కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

హామీల అమలులో విఫలం

గట్టుప్పల, న్యూస్‌టుడే: అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నారీ ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, మండల కార్యదర్శి మల్లేశం, సుధాకర్‌గౌడ్, వెంకటేశం, నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సహాయకులకు ప్రశంసా పత్రాలు

మర్రిగూడ: చింతపల్లి మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజులుగా నీటి సహాయకులకు జరుగుతున్న శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. గ్రామాల్లో స్వచ్ఛమైన నీటి నాణ్యతపై సాంకేతిక నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారని సహాయకులకు తెలిపారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే:

? నల్గొండలోని గుండ్లపల్లి క్రాస్‌రోడ్ల సంతోష్‌నగర్‌లో కల్వర్టు లేక ఇళ్ల మధ్యనే మురుగునీరు చేరుతోంది. రోడ్డుపై గుంతలు పడ్డాయి. మురుగు పోయేందుకు మరమ్మతులు చేయించాలి. - కళ్యాణ్, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయిస్తాం. - ప్రవీణ్, ఏఈ, నల్గొండ పురపాలిక.

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

నకిరేకల్, న్యూస్‌టుడే: పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో నకిరేకల్ మండల ఉపాధ్యాయులకు ప్రాధాన్యం దక్కింది. యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఈ మండలానికి చెందిన లగిశెట్టి సత్యనారాయణ, ముప్పు కవిత, కప్పల యాదయ్య, ఎం.ఏ కరీమ్ ఎన్నికయ్యారని మండల అధ్యక్ష, కార్యదర్శులు వంటల ఆనంద్‌బాబు, చిక్కుల సుధాకర్ మంగళవారం తెలిపారు. ఎన్నికైన వారిని అభినందించారు.

చిట్యాల, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా చిట్యాల ప్రాథమిక పాఠశాలకుచెందిన బాదం భిక్షపతితో పాటు జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన బమ్మ లుకేందర్‌రెడ్డి, పల్లెర్ల యుగంధర్‌రెడ్డి (పెద్దకాపర్తి), దంతూరి సైదులుగౌడ్ (వనిపాకల), కందాల చంద్రారెడ్డి (ఏపూరు), సోమగాని సైదులు (ఉరుమడ్ల), పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి(ఎలికట్టె), ఉపాధ్యక్షుడిగా వల్లం నాగరాజు (పీసీఎస్, నేరడ), కార్యదర్శులుగా అర్థల వెంకట్‌రెడ్డి(గుండ్రాంపల్లి), దార గోవర్ధన్(వెలిమినేడు) ఎన్నికయ్యారు.

కనగల్: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ధారం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు.

కేతేపల్లి: పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ కార్యవర్గంలో కేతేపల్లి మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు స్థానం లభించింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గుడిపాటి నర్సయ్య, సి.హెచ్.వేణుగోపాల్‌రావు, మారుపాక నర్సయ్య, సంగెం వెంకటమోహన్, వోలేటి రాధాకృష్ణమాచారి, రాపోలు రవి ప్రకాశ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆటలో మెరిసి.. పోటీలో నిలిచి

జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో తలపడుతున్న విద్యార్థులు



హేమంత్ పృథ్వీసాయి

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో గుర్తింపు రావాలంటే కేవలం చదువు తోనే సరిపోదని భావించారు ఆ చిన్నారులు. ఇతర అంశాల్లోనూ రాణించాలనుకున్నారు. అందరినుంచి విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో తర్ఫీదు పొందుతూ ముందుకు సాగుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారం, వెండి పతకాలు సాధిస్తున్నారు నార్కట్‌పల్లికి చెందిన కొందరు విద్యార్థులు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే సీబీఎస్‌ఈ అండర్-19 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు. వీరు ప్రస్తుతం నార్కట్‌పల్లి సమీపంలోని శ్రీ విద్యాపీఠ్ పాఠశాలలో చదువుతున్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి..

నకిరేకల్‌కు చెందిన సూర్య ప్రతాప్, అనసూయ దంపతుల కుమారుడు హేమంత్ పృథ్వీసాయి. తండ్రి ఆర్మీలో పనిచేస్తున్నారు. తల్లి రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక పెద్దవూర మండలం బాలరాజ్, అంజలి దంపతుల కుమారుడు జతిన్. తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఇద్దరు నార్కట్‌పల్లి సమీపంలోని శ్రీ విద్యాపీఠ్ సీబీఎస్‌ఈ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గత నెల నల్గొండలో జరిగిన సీబీఎస్‌ఈ క్లస్టర్-7 అథ్లెటిక్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆ ఇద్దరు విద్యార్థులు రాణించి పతకాలు సాధించారు. పదో తరగతి చదువుతున్న హేమంత్ ట్రిపుల్ జంపులో బంగారు పతకంతో పాటు లాంగ్ జంప్ పోటీలో పాల్గొని వెండి పతకం సాధించాడు. 9వ తరగతి చదువుతున్న జతిన్ 5 వేల మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించాడు. ఈ ఇద్దరు విద్యార్థులు గత ఏడాది ఏపీలోని నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని మూడు, నాలుగో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం వారణాసిలో జరిగే సీబీఎస్‌ఈ అండర్-19 జాతీయ స్థాయిలో సుమారుగా 14 దేశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ పోటీలో వీళ్లు బంగారు పతకం సాధిస్తే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంటారని పీఈటీ జగదీశ్వర్ రావు తెలిపారు. వీరికి రవాణా, ఇతర ఖర్చులకు శ్రీవిద్యాపీఠ్ యాజమాన్యం రూ.40వేలు అందజేసినట్లు తెలిపారు.



జతిన్

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

స్పందనకు వందనం

నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు పున ప్రారంభమయ్యాయి. సుందరీకరణలో భాగంగా గత రెండేళ్ల క్రితం చేపట్టిన రోడ్డ విస్తరణ పనులు గత శాసనసభ ఎన్నికల సమయంలో నిలిచిపోయాయి. అప్పటి నుంచి వివిధ కారణాలతో గడియారం కేంద్రం నుంచి పెద్దబండ వరకు అసంపూర్తిగా పనులు ఆగిపోయిన విషయంపై ఈనాడులో కథనాలు ప్రచురితం కావడంతో ఇటీవల మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లుల మంజూరు చేసేలా చర్యలు చేపట్టడంతో గుత్తేదారులు రోడ్డు, కల్వర్టు, నడక దారి నిర్మాణ పనులు ప్రారంభించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండలో అమృత్-2 పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజారోగ్య, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పట్టణంలో నిర్మి



పరిశీలిస్తున్న పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, తదితరులు


స్తున్న మంచినీటి నిల్వ ట్యాంకులు, యూజీడీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు వేసవి నుంచి నిరంతరం తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించేవిధంగా పర్యవేక్షణ పెంచాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, ఏఈలు ప్రసాద్, దిలీప్‌భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే..





కనగల్: మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



చిట్యాలలో కరెన్సీనోట్లతో మహాలక్ష్మీదేవిగా అమ్మవారి అలంకరణ



చిట్యాల కనకదుర్గ ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



నకిరేకల్: వాసవీ నగర్ దుర్గామాత మండపంలో పుర ఛైర్‌పర్సన్ రజిత, ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప పూజలు




కేతేపల్లిలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు ప్రత్యక్షమయ్యారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. చిట్యాల కనకదుర్గ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. - న్యూస్‌టుడే, బృందం



నాంపల్లి: పస్నూరు రామాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నల్గొండ: బ్రహ్మంగారి గుట్టపై ఉన్న శివసమేత కనకదుర్గ దేవాలయంలో...



శాలిగౌరారం: బాలిశెట్టిగూడెంలో ...

ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన శ్రేణులు

నకిరేకల్, న్యూస్‌టుడే: పది రోజుల లండన్ పర్యటన ముగించుకుని శంషాబాద్ విమానాశ్రయానికి మంగళవారం తెల్లవారుజామున చేరుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో శ్రేణులు విమానాశ్రయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగోని కొండయ్య, వీరార్జున్‌రెడ్డి, నకిరేకంటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నమ్మొద్దు

కనగల్, న్యూస్‌టుడే: ప్రజల మూఢనమ్మకాలను, బలహీనతలను సొమ్ము చేసుకోవడం కోసం కొంత మంది అమాయకమైన వారిని ఎంచుకుని పసుపు, కుంకుమలు, నిమ్మకాయలతో మూట కట్టి వారి ఇళ్లల్లో వేసి భయభ్రాంతులకు గురి చేస్తారని అలాంటి వాటిని పట్టించుకోవద్దని జన విజ్ఞాన వేదిక సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం లింగాల్లగూడెంలో జన విజ్ఞాన వేదిక బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంత మంది వ్యక్తిగత ప్రయోజనాలకోసం ప్రజలను మోసం చేస్తున్నారని.. బాణామతి, చేతబడి, నరబలులాంటివి నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో దగ్గుపాటి విమల, కె.రాఫెల్, జంజరాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

సులభంగా.. వేగంగా



తాస్కానిగూడెంలో డ్రోన్ స్ప్రేయర్ ద్వారా పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

చండూరు, న్యూస్‌టుడే: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుకూలంగా అన్నదాత అడుగులు వేస్తూ వ్యవసాయ రంగంలో రాణిస్తున్నారు. కూలీల కొరతను అధిగమించి, సమయాన్ని ఆదా చేసుకుని ఎక్కువ కష్టపడకుండా తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. యాంత్రీకరణ పద్ధతులు పాటిస్తూ వ్యవసాయ రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నారు. చండూరు మండలంలోని తాస్కానిగూడెం గ్రామంలో బుర్ర పరమేష్ అనే రైతు 20 ఎకరాల పత్తి చేనుకు డ్రోన్ స్ప్రేయర్ ద్వారా పురుగు మందు పిచికారీ చేస్తూ 'న్యూస్‌టుడే' కంటపడ్డాడు.

పంటల బీమాను అమలు చేయాలి

కనగల్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కనగల్‌లో పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్న విధంగా ఆర్థిక తోడ్పాటు, పంటల బీమా వెంటనే అమలు చేయాలన్నారు. నల్గొండ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలను నమోదు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధులు పిండి పాపిరెడ్డి, వట్టికోట దుర్గ, మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులకరం బిక్షం, దాసరి వెంకన్న, బైరగోని అశోక్, నాయకులు పంతంగి సైదులు, గోశెట్టి భద్రమ్మ, పాలకూరి సరిత, నీలకంఠం వెంకన్న నాగబాబు పాల్గొన్నారు.



కనగల్‌లో సభ్యత్వం అందజేస్తున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదగోని శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నకిరేకల్ ప్రధాన కూడలిలో ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న మంగళవారం నిర్వహించారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాస శ్రీను, చినేని జానీ, గోలి ప్రభాకర్, పి.నర్సింహ పాల్గొన్నారు.

మర్రిగూడ: హరియాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా అధికారం కైవసం చేసుకోవడంతో మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, పిట్టల శ్రీనివాస్, యాదగిరి, లింగస్వామి, రమేష్ ఉన్నారు.



నాంపల్లి: కర్నాటి రామలింగం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

కర్నాటి రామలింగం కుటుంబానికి పరామర్శ

నాంపల్లి: నాంపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు, మాల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కర్నాటి రామలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం దశదిన కార్యక్రమాల సందర్భంగా మాజీ ఎంపీ, భాజపా నాయకులు బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ హాజరై చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నాయకులు కర్నాటి విద్యాసాగర్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, సతీశ్, మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కాంతారెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పూలతో బతుకమ్మను పేర్చడం సంతోషకరం

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని పోలీస్ మైదానంలో పోలీస్ కుటుంబ సభ్యులు మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ సతీమణి పూజతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి మహిళలు పండుగ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. పోలీస్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, మహిళా ఎస్సైలు శ్రావణి, మమత తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ మైదానంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఎస్పీ సతీమణి పూజ, తదితరులు

నల్గొండ అర్బన్: జిల్లా కేంద్రం పరిధిలోని చర్లపల్లిలో ఈనెల 10న జిల్లా స్థాయి బతుకమ్మ పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** శ్వాగ్, **పీవీఎన్:** రామ్‌నగర్ బన్నీ

నకిరేకల్: **రామకృష్ణ-** శ్వాగ్, **వెంకటేశ్వర-** దేవర

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

మాదాపూర్, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు, సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో మొత్తం 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఆరు కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు.

★ మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీపీ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కుక్షి తహసిల్‌లోని ఖనియాంబ గ్రామానికి చెందిన కరన్ మనోహర్‌బాబర్(23), ప్యార్‌సింగ్ బవుల(27), డెబ్రాబవుల(37), కడక్‌సింగ్(38), చిరాడ్ గ్రామానికి చెందిన ఠాకూర్ ఈడియ(30), కుమన్ ఈడియ(30) జల్సాలకు అలవాటు పడి దొంగతనాల బాటపట్టారు. కరన్ మనోహర్‌బాబర్, కడక్‌సింగ్ నేతృత్వంలో రెండు ముఠాలుగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలు చేస్తున్నారు. పగలు రెక్కీ చేసి అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్యలో తాళాలు విరగ్గొట్టి ఇళ్లల్లోకి వెళ్లి అందినకాడికి ఎత్తుకెళ్తున్నారు. చోరీ చేసిన సొత్తును స్వస్థలాలకు వెళ్లి అమ్మి ఆ డబ్బుతో జల్సాలు చేస్తున్నారు.

పూజలు చేసి...

ధార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉంటున్న వీరంతా గిరిజనులు. వ్యవసాయ పెట్టుబడితో పాటు జల్సాలకు 2020 నుంచి దొంగతనాల బాటపట్టారు. ప్రతి ముఠాలో ఆరుగురు సభ్యులుంటారు. దొంగతనం సఫలం కావాలని, పెద్దమొత్తంలో సొత్తు లభించాలని స్వగ్రామంలో గ్రామదేవతకు పూజలు చేసి అక్కడినుంచి ప్రైవేటు బస్సుల్లో ఇక్కడికి చేరుకుంటారు. అర్ధరాత్రి తర్వాత చోరీలు చేస్తుంటారు. ఆ సమయంలో ఎవరైనా ఎదురుపడితే వారిని హతమార్చేందుకు కత్తులు తీసుకెళ్తారు. ప్రధాన నిందితులైన కరన్‌మనోహర్ బాబర్‌ను గతంలో బాచుపల్లి, దుండిగల్, అమీన్‌పూర్ పోలీసులు జైలుకు పంపారు. 2002లో జైలు నుంచి వచ్చాక మళ్లీ దొంగతనాలు చేస్తున్నారు. కడకొసింగ్‌ను కేపీహెచ్‌బీ, హయత్‌నగర్‌తోపాటు ఒంగోలు పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపినా మార్పు రాలేదు.

సంక్షిప్త సమాచారం

అల్పాహారం పంపిణీ... నకిరేకల్: నకిరేకల్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రోగుల సహాయకులకు స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని మంగళవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బి.ప్రకాశరావు, నవ్య క్లబ్ అధ్యక్షురాలు ఎన్.రమాదేవి, ప్రతినిధులు యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, రఘునమ్మ, టి.ప్రభాకర్‌రావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు... మర్రిగూడ: మండల పరిధిలోని రాజపేట తండా నుంచి రాంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు జేసీబీతో తొలగించారు. యాదయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

విగ్రహం ఆవిష్కరణ... నకిరేకల్: మర్రూరు గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తండు సైదులుగౌడ్ సోమవారం రాత్రి ఆవిష్కరించారని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడు పుట్ట జానయ్యగౌడ్, నకిరేకల్ అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తిరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారని వివరించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలి

కనగల్, న్యూస్‌టుడే: ఖరీఫ్ 2024-25లో ధాన్యం కొనుగోలు చేసే విధానంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఎంఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై ఆయా శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. దసరా తరువాత ధాన్యం కొనుగోలు చేసేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆమేరకు సాంకేతిక పరమైన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐకేపీలో పనిచేసే సిబ్బంది జవాబుదారితనం, పారదర్శక విధానాల్లో విధులు నిర్వహించాలన్నారు. మండల వ్యవసాయాధికారి అమరేందర్‌గౌడ్, ఎంపీవో సుమలత, ఏపీఎం సంకు హరి, పీఏసీఎస్ కార్యదర్శి రామచంద్రారెడ్డి ,సీసీలు నర్సింహ, వసంత, ప్రభాకర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ గ్రామీణం: పండించిన ధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని నల్గొండ మండల ప్రత్యేక అధికారి ఖదీర్ అన్నారు. నల్గొండ మండలంలో ప్రారంభించనున్న ఐకేపీ కేంద్రాల నిర్వాహణపై మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యం ఆరబెట్టి తీసుకరావాలన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద కావాల్సిన వసతులు కల్పించాలని తెలిపారు. మంచినీరు, నీడ ఏర్పాటు చేయాలని వివరించారు. ఇందులో ఎంపీడీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, ఎపీడీ వినోద తదితరుల పాల్గొన్నారు.

మునుగోడు: ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి మురళీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద తప్పనిసరిగా టార్పాలిన్లు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతులను కల్పించాలన్నారు. తహసీల్దారు నరేందర్, ఎంపీడీవో పూజ, ఏవో పద్మజా, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



మునుగోడులో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి మురళీ

శాలిగౌరారం: రైతులు పండించిన నాణ్యమైన ధాన్యం యార్డుకు తెచ్చి సరైన గిట్టుబాటు ధర పొందాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి చరితారెడ్డి అధికారులకు సూచించారు. శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై ఎంపీడీవో జ్యోతిలక్ష్మి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డులో రైతులు అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో. ఏవో సౌమ్యశృతి, ఏపీవో జంగమ్మ, ఏపీఎం జానకి, సీసీలు పాల్గొన్నారు

కేతేపల్లి: వానాకాలం సీజన్‌లో మూసీ ఆయకట్టులో పండిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తామని పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీశ్ చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయమై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించారు. వచ్చే వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

అలరించిన అపూర్వ సమ్మేళనం


కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

హాలియా, న్యూస్‌టుడే: హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 సంవత్సర పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం అలరించింది. బాల్య మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, పూర్వవిద్యార్థులు వెంకటేష్, శేఖర్, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ మండలం నుంచి గాజీనగర్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రహదారికి మరమ్మతులు చేపట్టాలి.. **కె.మోతీలాల్, గాజీనగర్**

✔ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.. **భాస్కర్, ఆర్‌అండ్‌బీ డీఈ**

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రెడ్డికాలనీలో కోతులు స్వైర విహారం చేస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నాయి. – సాయి, మిర్యాలగూడ

✔ కోతుల నివారణకు చర్యలు తీసుకుంటా.
– ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

క్రీడలపై యువత దృష్టి సారించాలి: బీఎల్ఆర్


మిర్యాలగూడలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలపై సైతం యువత దృష్టి సారించాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. బీఎల్ఆర్ సోదరుల ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడలోని ఎన్నెస్పీ క్యాంపు క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 బృందాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, వెంకన్న, నాగరాజు, భీమేష్, మనోహర్, లక్ష్మణ్, అశోక్, రమేష్, నాగునాయక్, అడావత్ చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వినతి.. మిర్యాలగూడ: డీజే సౌండ్ సిస్టంల వినియోగంపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేయాలని కోరుతూ పట్టణ డీజే అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే బీఎల్ఆర్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ర్యాలీగా తరలివచ్చి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ప్రదర్శన చేపట్టి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 500 కుటుంబాలు వీధినపడే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలు, ఆంక్షలు విధించి డీజేల ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రోడ్డు ఘోరం.. ఒళ్లు హూనం

దేవరకొండ, న్యూస్‌టుడే: గతుకుల రోడ్లతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా దేవరకొండ రెవెన్యూ డివిజన్ కేంద్రం పురపాలికలో అధ్వాన్న రోడ్లతో జనం బెంబేలెత్తుతున్నారు. రూ.కోట్లతో టెండర్లు వేసినా గుత్తేదారులు పనులు చేసేందుకు ససేమిరా అంటున్నారు. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసినా తమకు రూ.కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటి బకాయిలు చెల్లిస్తేనే కొత్తవాటి జోలికి వెళ్తామని వారు భీష్మించుకున్నారు. దీంతో ప్రజలు ఏళ్ల తరబడి గతుకుల రోడ్లతో ఇబ్బందులకు గురవుతున్నారు.

గుత్తేదారులకు సూచిస్తాం: భాస్కర్, ఆర్‌అండ్‌బీ డీఈ
రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచిస్తాం. వారు పాత బిల్లులు వచ్చాక పనులు చేస్తామంటూ సమాధానమిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఇబ్బందిగా ఉంది: కొండ మల్లేశ్వరి, కౌన్సిలర్



ఇటీవల జరిగిన వినాయకచవితి పండుగ సందర్భంగా మండపాలు ఏర్పాటుకు, నవరాత్రులు నిర్వహించుకోవడానికి, శోభాయాత్ర జరపాలన్నా.. బతుకమ్మ పండుగ, దేవినవరాత్రులు నిర్వహించుకోవాలన్నా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.



ఈ చిత్రంలో కన్పిస్తున్న రహదారి దేవరకొండ నుంచి డిండి మీదుగా శ్రీశైలం, కర్నూల్, మంత్రాలయం, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి. ఇప్పటికే గుంతలు పడి కంకర తేలి ప్రయాణం నరకంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రూ.14కోట్లతో ఐదు నెలల క్రితం రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు.



ఈ చిత్రంలో కన్పిస్తున్న రహదారి దేవరకొండ పట్టణంలోని పోలీస్ కార్యాలయం నుంచి ముత్యాలమ్మబజార్ మీదుగా చెన్నారం వ్యవసాయ పొలాల వరకు వెళ్లేది. మూడు కిలోమీటర్ల మేర రూ.7కోట్లతో ఆరు నెలల క్రితం గుత్తేదారు టెండర్లు దక్కించుకున్నారు. కానీ పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఈ చిత్రంలో కన్పిస్తున్న అధ్వాన రోడ్డు దేవరకొండ పట్టణంలోనిది. 2018 నుంచి అండర్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పేరిట రోడ్లను ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.30కోట్లు అంతర్గత రహదారి నిర్మాణానికి మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, టెండర్లు ఆలస్యం జరుగడంతో ఏళ్ల తరబడి పురపాలిక ప్రజలు అధ్వాన రోడ్లతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

నియామకం


జానకిరెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రఉపాధ్యక్షురాలిగా జానకిరెడ్డి నియమితులయ్యారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన జానకిరెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమిస్తూ ఫోరం రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. జానకిరెడ్డి ఇప్పటివరకు ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా విశేష సేవలను అందజేసినందుకుగాను ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించినట్లు ఆయన తెలిపారు.

పీఆర్‌టీయూ కార్యవర్గంలో చోటు


రాపోలు పరమేష్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాపోలు పరమేష్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పరమేష్ ప్రస్తుతం కేతేపల్లి మండలం భీమారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



గుర్రంపోడు: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నడికడ జడ్పీ ఉన్నతపాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు **మూరెడ్డి వెంకటరెడ్డి** ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్రకమిటీ ఆదేశాలు అందజేసింది.



పెద్దవూర: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పెద్దవూర మండలం బెట్టెలతండా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న **వడ్డపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి** ఎంపికయ్యారు.



మిర్యాలగూడ పట్టణం: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన **గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి** ఎన్నికయ్యారు. ప్రస్తుతం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న సుదర్శన్‌రెడ్డి పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


రైతుసదస్సులో మాట్లాడుతున్న సాయిబాబా

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని, అధిక విస్తీర్ణంలో సాగుచేసుకుని లాభాలు పొందాలని ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి వి.వి.ఎస్ సాయిబాబా కోరారు. మంగళవారం గుర్రంపోడు మండలం కొప్పోలు రైతువేదికలో ఏర్పాటైన ఆయిల్‌పామ్ సాగు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, సాగువివరాలను ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు ఎస్ శ్రీనివాస్ తెలిపారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ యాదగిరి, కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజాగౌడ్, ఉద్యానశాఖ మల్లేపల్లి క్లస్టర్ అధికారి మురళి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదినం


నాగార్జునసాగర్: కేకు కోస్తున్న జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం సాగర్‌లోని ఆయన నివాసగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆయన జన్మదిన కేకు కోసి వేడుకలను చేసుకున్నారు. జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు స్థానిక కమలానెహ్రూ ఆసుపత్రిలో రక్తదానం చేశారు. పీసీసీ కార్యవర్గసభ్యుడు, జడ్పీ మాజీ ఛైర్మన్ లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాగార్జునసాగర్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ, కౌన్సిలర్ మోహన్‌రావు, భగవాన్‌నాయక్, రాంబాబు, రామకృష్ణరెడ్డి నాగరాజు, సురేష్, శ్రీనివాసు, జంగయ్య పాల్గొన్నారు.

త్రిపురారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, అనంతరెడ్డి, మారయ్య గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, పద్మ కేకు కోసి పంపిణీ చేశారు.

నిడమనూరు: నిడమనూరులో అంకతి సత్యం, ఉన్నం చినవీరయ్య, నందికొండ మట్టారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రెడ్డి, కుందూరు లక్ష్మారెడ్డి, మధు, ఉన్నం శ్రీను, సింగం రామలింగయ్య, కుంచం సతీష్‌లు ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కేకు కోశారు.

హాలియా: హాలియాలో చర్మకారులకు నిత్యావసర సరకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు మందా సైదులురావుగౌతమ్ సహకారంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజారమేష్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సైదులుమాదిగ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మాడ్గులపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి కేకు కోసి సంబరాలు చేశారు. నర్సింహ, జానయ్య, ఎల్లయ్య, సైదులు, సత్యనారాయణ, లింగారెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

నిడమనూరు, న్యూస్‌టుడే: వర్షాకాల పంట సీజన్ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధం కావాలని, మండల ప్రత్యేకాధారి పశుసంవర్ధన శాఖ ఇన్‌ఛార్జి జేడీ జూలకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిడమనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశంతో కలిసి ఆయన మండల స్థాయి అధికారులతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సీజన్ మండల వ్యాప్తంగా ఐకేపీ, ప్యాక్స్, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కలిపి మొత్తం 14 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పంటకోతల సమయానికి తగ్గట్లు కేంద్రాల ప్రారంభించాలని సూచించారు. మార్కెట్ కార్యదర్శి చందర్‌రావు, ఏపీఎం లక్ష్మీనర్సింహ్మా, నిడమనూరు ప్యాక్స్ సీఈవో జానయ్య, ఏఈవో క్రాంతి కుమార్, సెర్ప్ సీసీ బాలునాయక్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: రైతుల సౌకర్యార్థం మండలంలో మూడు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి విజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 26 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చిన్నఅడిశర్లపల్లిలో సన్న ధాన్యం, చింతకుంట్ల ఎక్స్‌రోడ్, బాబ్లతండాల్లో దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో బాలరాజురెడ్డి, డీటీసీపీ అధికారి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చింతబండకు చెందిన ఎడ్ల సైదులు(46) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. మంగళవారం మిర్యాలగూడ ప్రాంతీయ వైద్యశాలలో కుటుంబ సభ్యుల అంగీకారంతో అతడి నేత్రాలను సేకరించినట్లు డైమండ్ నేత్రనిధి వ్యవస్థాపకుడు మాశెట్టి శ్రీనివాస్, వాసవీ క్లబ్ ప్రతినిధి మిట్టపల్లి విజయభాస్కర్ తెలిపారు. నేత్రాలను హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి తరలించినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

దేవరకొండ, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మండలం తాటికోల్ గ్రామ మాజీ సర్పంచి జూలూరు ధనలక్ష్మి, మాజీ డిండి నీటి సంఘం ఛైర్మన్ తిప్పర్తి రుక్మారెడ్డిలు అన్నారు. మంగళవారం తాటికోల్ గ్రామంలో యశోద హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 300 మంది పలు రకాల పరీక్షలు నిర్వహించుకోగా.. లయన్స్‌క్లబ్ తరఫున ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, భిక్షమయ్య, ప్రభాకర్, నిరంజన్, రాజేష్, వనం శ్రీను, కృష్ణయ్య తదితరులున్నారు.

కేబుల్ వైర్ చోరీ


నక్కలగండి ప్రాజెక్టు సమీపంలో చోరికి గురైన కేబుల్ వైర్

చందంపేట, న్యూస్‌టుడే: మోత్యతండాలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మోత్యతండాకు చెందిన ఇస్లావత్ మాన్య, మోతిలాల్, సేవులు, శంకర్, గోపాల్, చంద్రు, శంకర్‌లు నక్కలగండి ప్రాజెక్టు సమీపంలోని డిండి వాగులో బోరు మోటార్లు ఏర్పాటు చేసుకొని పంట సాగుచేస్తున్నారు. ఇటీవల పలువురు రైతులకు చెందిన కేబుల్ వైర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. వీటి విలువ దాదాపు రూ.3లక్షల వరకు ఉంటుంది. ఇదే క్రమంలో మళ్లీ సోమవారం రాత్రి నలుగురు యువకులు దాదాపు ఏడుగురి రైతుల మోటార్ల నుంచి కేబుల్‌వైర్ కత్తిరించి అపహరించే క్రమంలో దొంగల కోసం కాపుకాస్తున్న ఇద్దరు రైతులు వారిని వెంబడించారు. వారి ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూపీకి చెందిన యతి నర్సింగానంద సరస్వతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జమాతే ఉల్మా ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి.. కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మౌలానా జావీద్, ముఫ్తీ ఇసాక్ సలీం, హఫీజ్, యాకూబ్, యూసుఫ్, సలీం, సమీఖాద్రి, అంజద్, వదూద్, గయాస్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. శవమై తేలి


మోదాల నర్సింహ

క్రైం రిపోర్ట్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి శవమై తేలిన ఘటన మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన మోదాల నర్సింహ(50) అదే కాలనీలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసైన నర్సింహ తరచూ ఇంటి నుంచి వెళ్లి పోయి.. తిరిగి ఒకటి రెండు రోజుల్లో తిరిగొచ్చేవాడు. ఈ నెల ఏడున ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సింహ ఎంతకూ రాకపోవడంతో కుమారుడు సంకేత్ మంగళవారం ఉదయం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం సామాజిక మాధ్యమాలలో తండ్రి ఫోటో పెట్టాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు అక్కడి పోలీసుల ద్వారా సమాచారం అందడంతో వెళ్లి చూడగా.. తన తండ్రి దేనని గుర్తించారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ నాగార్జున తెలిపారు. కాగా నర్సింహ మృతికి మద్యం మత్తే కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు సమాచారం.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నిడమనూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన పాల్వాయి మట్టయ్య రెండో కుమారుడు **పాల్వాయి శ్రీకాంత్**(33) డీఆర్‌డీఏ నల్గొండ జిల్లా కార్యాలయంలో పొరుగు సేవల పద్ధతిన పనిచేస్తున్నాడు. ఇంటిదగ్గరే ఉన్న శ్రీకాంత్ మధ్యాహ్నం కుటుంబసభ్యులతో మాట్లాడిన అనంతరం విశ్రాంతి తీసుకోవడానికి తన గదిలోకి వెళ్లి తలుపువేసుకున్నాడు. సాయంత్రమైనా కిందికి రాకపోవటంతో తన అన్న వెంకన్న పైకి వెళ్లి చూడగా శ్రీకాంత్ ఉరేసుకుని కన్పించటంతో.. కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందాడు. కాగా శ్రీకాంత్‌కు అతడి స్నేహితులకు మధ్య ఆర్థిక సంబంధమైన విషయాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి గదిలో సూసైడ్‌నోట్‌ను కుటుంబసభ్యులు, పోలీసులు గుర్తించగా.. ఆ పత్రం పోలీసుల స్వాధీనంలో ఉంది. ఘటనాస్థలాన్ని హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్సై గోపాల్‌రావు సిబ్బందితో కలిసి పరిశీలించి, మరణోత్తర పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

వేములపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 5న ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో పడి గల్లంతైన అంగన్‌వాడీ ఉపాధ్యాయిని పేరబోయిన అనూష మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డి.వెంకటేశ్వర్లు తెలిపారు. గత మూడు రోజులుగా సాగర్ ఎడమకాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యమైందన్నారు. మృతురాలి తల్లి కుమ్మరి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించమన్నారు. వైద్యులు మరణోత్తర పరీక్షల అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రక్షిత నీటిని అందించేందుకు పని చేయాలి


చింతపల్లిలో నీటి సహాయకులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న మిషన్ భగీరథ ఈఈ డి.శాంతకుమారి

చింతపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రతి ఇంటికి రక్షిత తాగు నీరు అందించేందుకు నీటి సహాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలని మిషన్ భగీరథ ఈఈ డి.శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజులపాటు నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో నీటి పైపులు లీకేజీ కాకుండా చూడాలని, మిషన్ భగీరథ నీళ్లు కలుషితం కాకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రశంసా పత్రాలను అందించారు. ఎంపీడీవో సుజాత, ఏఈలు బి.శేఖర్, జి.వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, డి.వెంకటయ్యలు పాల్గొన్నారు.

రోడ్డు వెంట వ్యర్థాలు.. తప్పని ఇబ్బందులు



మిర్యాలగూడలోని విద్యానగర్ మహాలక్ష్మి దేవాలయం రోడ్డులో ఖాళీ స్థలాలు, రహదారి వెంట వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. వ్యర్థాలను రోజుల తరబడి తరలించకపోవడంతో దుర్వాసనకు తోడు దోమలతో అనేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పుర అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు. వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ ఎండీ యూసుఫ్ తెలిపారు. – న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

రోగులకు మెరుగైన సేవలందించాలి

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి(ఎంఎస్‌వో) దస్రునాయక్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలనకు వచ్చిన ఆయన స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై తగు సూచనలు చేసిన అనంతరం పీహెచ్‌సీ సందర్శించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోసిన్‌బిన్ అహ్మద్, ఎంవో డాక్టర్ అజహర్‌అహ్మద్, ఏపీఎం శేషయ్య తదితరులున్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** శ్వాగ్
విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం, శ్వాగ్

అమ్మలగన్నమ్మ.. మూలపుటమ్మ


పెద్దవూర: పర్వేదుల గ్రామంలో..


హాలియాలో..


కొండమల్లేపల్లి: మహాలక్ష్మి అవతారంలో వాసవీమాత

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో మంగళవారం దుర్గామాత లక్ష్మీదేవీ అవతారంలో దర్శనమిచ్చారు. పెద్దవూర మండల పరిధిలోని పర్వేదుల గ్రామంలో దుర్గామాతను రూ.లక్షతో అలంకరించారు. సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా హాలియా సాయిప్రతాప్‌నగర్ జరగుతున్న శ్రీదుర్గా అమ్మవారి నవరాత్రుల కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శాఖాంబరీదేవీకి ప్రత్యేక పూజలు చేశారు.
–న్యూస్‌టుడే, బృందం


చింతపల్లి: కుర్మేడ్‌లో..


దేవరకొండ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో..


చింతపల్లి మండలం తీదేడులో..


మిర్యాలగూడ గాంధీనగర్‌లో..


అడవిదేవులపల్లిలో..

ప్రమాదం జరిగితే కానీ.. పట్టించుకోరా..?



మండలంలోని చింతలపాలెం శివారు ప్రాంతంలో ప్రధాన రహదారి వెంట ఉన్న రైతు వస్త్రపూరి నర్సింహ పత్తి చేనులో విద్యుత్తు స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. పత్తి చేనులో అరక దున్నే సమయంలో పత్తిని తీయాలంటే కూలీలు భయపడుతున్నారని రైతు వాపోతున్నాడు. విద్యుత్తు అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యపై విద్యుత్తుశాఖ ఏఈ సౌజన్యను సంప్రదించగా దాని గురించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని, గుర్తించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, తిరుమలగిరి సాగర్

యువత రాజకీయాల్లోకి రావాలి


నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి కేక్ కోస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేశ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే జైవీర్‌తో కలిసి కేకు కోసి.. అభిమానులు, పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఎమ్మెల్యే జైవీర్, మిట్టపల్లి వెంకటేశ్‌లను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు.